క్లుప్తంగా

అన్నవరప్పాడులో భక్తుల రద్దీ


విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి వారు

పెరవలి: అన్నవరప్పాడులోని వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు. తెల్లవారు జామున 4 గంటలకే పెద్ద ఎత్తున మహిళా భక్తులు ఆలయానికి వచ్చి దీపాలు వెలిగించారు. స్వామివారికి అభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు ఉదయం ఉచిత ప్రసాదాల పంపిణీతో పాటు ఉదయం 10 గంటల నుంచి అన్న సమారాధన చేశారు. అన్న సమారాధనలో 4 వేల మంది భక్తులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు.

రాగహర్షిణికి ట్రిపుల్ ఐటీలో సీటు


రాగహర్షిణి

నల్లజర్ల: టెన్త్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన మండలంలోని ఆవపాడు గ్రామానికి చెందిన మారిశెట్టి రాగహర్షిణి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్టు ఎంఈఓ భగవతి తెలిపారు. టెన్త్‌లో 567 మార్కులతో మండల టాపర్‌గా నిలిచిన రాగహర్షిణికి ప్రకాశం జిల్లా ఒంగోలులోని డాక్టరు ఏపీజే అబ్దుల్ కలాం ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చిందని ప్రకాశరావు పాలెం హైస్కూల్ హెచ్‌ఎం ఎ.జయశంకర్ తెలిపారు. రాగహర్షిణి తండ్రి తాపీ మేస్త్రీ. కుమార్తెను కష్టపడి చదివించారు.

ఖండవల్లిలో వైద్య సిబ్బంది స్పెషల్ డ్రైవ్


ఖండవల్లిలోని ఓ ఇంటి వద్ద నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్న వైద్య సిబ్బంది

పెరవలి: మండలంలోని ఖండవల్లి గ్రామాన్ని శనివారం పెరవలి పీహెచ్‌సీ డాక్టర్ ఎ.కృష్ణవేణి, సిబ్బంది సందర్శించి, వర్షాకాలంలో పారిశుద్య ప్రాధాన్యం ఆవశ్యకతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వారందరూ గ్రామంలో ఇంటింటా తిరుగుతూ మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి నీరు దిగువకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎ.కృష్ణవేణి మాట్లాడుతూ నిల్వ నీటి వలన దోమల వ్యాప్తి వేగంగా జరుగుతుందన్నారు. దోమల వ్యాప్తి వలన మలేరియా, డయేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలుతాయన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడు రోగాలు దరి చేరవని సూచించారు. కార్యక్రమంలో ఖండవల్లి గ్రామ వైద్య సిబ్బంది కూడా పాల్గొన్నారు.

సమిశ్రగూడెంలో నేడు ఉచిత వైద్యశిబిరం

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెంలోని గీతా మందిరంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకుడు జి.సత్తిబాబు తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన విశ్వనాథ ఆసుపత్రి వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. ఆర్థోపెడిక్ తో పాటు వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

పెరవలి: మండలంలోని ఉసులుమర్రులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శనివారం పెరవలి పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.12,170 స్వాధీనం చేసుకున్నామని ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరిచామని చెప్పారు.

మేలైన పశుగ్రాసంపై రైతులకు అవగాహన


ఊనగట్లలో రైతులకు అవగాహన కల్పిస్తున్న పశు వైద్యులు

చాగల్లు: పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో పశుగ్రాస వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారులు యు.ముఖేష్, ఎం.రాజేష్ శనివారం మండలంలోని చాగల్లు, నెలటూరు, మల్లవరం, మార్కొండపాడు, ధారవరం, కలవలపల్లి, ఊనగట్ల గ్రామాల్లో పర్యటించి పాడి రైతులకు మేలైన పశుగ్రాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 14 వరకూ ఈ వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామంలో పాడి రైతులకు పశువుల పెంపకంలో మెళకువలు, నూతన మేలు జాతి బహువార్షిక పశుగ్రాసం అవసరం, గడ్డి కోసే యంత్రాల ఉపయోగాల గురించి వివరిస్తున్నట్టు తెలిపారు.

అబ్బా .. ముసురేసింది


కొవ్వూరు మెయిన్ రోడ్డు పెట్రోల్ బంకుల సెంటర్లో చేరిన వర్షపు నీరు


కొవ్వూరు లాంచీల రేవు వద్ద గోదావరిలో వరద నీరు

- రానున్న 5 రోజులూ వర్షాలే అంటున్న వాతావరణ శాఖ
- డివిజన్‌లో సరాసరిన 32.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
- 63.65 శాతం పూర్తయిన ఖరీఫ్ వరి నాట్లు
- గోదావరిలో పెరుగుతున్న నీటిమట్టం

కొవ్వూరు: తెరిపి ఇవ్వకుండా కురుస్తున్న వర్షానికి జనం ఇళ్లకే పరిమితం అయ్యారు. నైరుతి రుతుపవనాలు, బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో రానున్న ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ సూచిస్తోంది. సోమ, మంగళవారాలు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. శనివారం తెల్లవారు జాము నుంచి కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా చినుకులు పడుతూనే ఉన్నాయి. నిడదవోలు, కొవ్వూరు వంటి పట్టణాల్లో రోడ్డు మార్జిన్‌లలో చిరు వ్యాపారాలు చేసుకునే ఈ చినుకులతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా ఎక్కువ మంది చిరు వ్యాపారులు తమ దుకాణాలను మూసివేశారు. దీంతో జన సంచారం లేక మెయిన్ రోడ్డు వెలవెలబోయింది. చాగల్లు, ఉండ్రాజవరం, నల్లజర్ల, దేవరపల్లి, నిడదవోలు మండలాల్లో భారీ వర్షం కురిసింది. విడవకుండా వర్షం కురుస్తుండడంతో పలువురు రైతులు మురగ దమ్ములు చేసుకునే పనుల్లో నిమగ్నం అయ్యారు.

జోరందుకున్న వరి నాట్లు

వర్షాలు కురుస్తూ వాతావరణం అనుకూలంగా మారడంతో కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా ఖరీఫ్ వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. ఇప్పటికే డివిజన్‌లో 63.65 శాతం విస్తీర్ణంలో వరినాట్లు పూర్తయ్యాయి. మండలాల వారీగా ఉండ్రాజవరంలో గరిష్ఠంగా 92 శాతం నాట్లు పూర్తవగా, నిడదవోలులో 90 శాతం, కొవ్వూరు, చాగల్లుల్లో 88 శాతం, నల్లజర్లలో 49 శాతం విస్తీర్ణంలో నాట్లు పూర్తయ్యాయి. ఇక గోపాలపురం మండలంలో కనిష్ఠంగా 20 శాతం విస్తీర్ణంలో మాత్రమే నాట్లు వేశారు. దేవరపల్లి, తాళ్లపూడి మండలాల్లో 27 శాతం విస్తీర్ణంలో వరి నాట్లు పూర్తయ్యాయి. డివిజన్ వ్యాప్తంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 38,465 హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగవుతుండగా, ఇంతవరకూ 24,483 హెక్టార్ల విస్తీర్ణంలో నాట్లు పూర్తయ్యాయి. డివిజన్ వ్యాప్తంగా 1,982 హెక్టార్లలో వరినారు మడులు పోయాల్సి ఉండగా, ఇప్పటి వరకూ 1,934 హెక్టార్లలో నారుమడులు పోశారు. గోపాలపురం, దేవరపల్లి మండలాల్లోని మెట్ట భూముల్లో ఇంకా నారుమళ్ల ప్రక్రియ పెండింగ్‌లో ఉంది. మిగిలిన మండలాల్లో దాదాపు పూర్తి కావచ్చాయి.

సరాసరిన 32.6 మిల్లీ మీటర్ల వర్షం

శనివారం ఉదయం ఎనిమిదన్నర గంటలతో ముగిసిన ఇరవై నాలుగు గంటల వ్యవధిలో కొవ్వూరు డివిజన్‌లో 32.6 మిల్లీ మీటర్ల సరాసరి వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా చాగల్లులో 46.2, ఉండ్రాజవరంలో 46.8, దేవరపల్లిలో 37.0, నల్లజర్లలో 42.4, తాళ్లపూడిలో 27.2, గోపాలపురంలో 16.2, కొవ్వూరులో 28.6, నిడదవోలులో 33.4, పెరవలిలో 15.4 మిల్లీమీటర్లు చొప్పున వర్షం కురిసింది.

పెరుగుతున్న గోదావరి

గోదావరి నది పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో నదిలో క్రమంగా వరద నీరు పెరుగుతోంది. నది ఎగువన మహారాష్ట్ర ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నందున పోలవరం ప్రాజెక్టు వద్ద ఇన్‌ఫ్లో పెరిగింది. శుక్రవారం లక్ష క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో శనివారం సాయంత్రానికి 1.40 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. దీంతో వచ్చిన వరదనీటిని అధికారులు వచ్చినట్టు దిగువకు విడిచిపెడుతున్నారు. క్రమంగా పెరుగుతున్న నదిలోని వరద నీటి ప్రవాహం నదీ గర్భంలోని ఇసుక మేటలను నెమ్మదిగా ముంచెత్తుతోంది. రానున్న రెండు రోజుల్లో వరద మరికాస్త పెరిగే సూచనలు ఉన్నాయని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. మరోవైపు బోట్స్‌మెన్ ర్యాంపుల్లోని ఇసుక నిల్వలు నది ఒడ్డునే ఉన్నాయి. వరద నీరు మరింత పెరిగితే సేకరించిన ఇసుక కొట్టుకుని పోయే ముప్పు ఉందని పడవల నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. కొవ్వూరు మండలంలోని వాడపల్లి, ఆరికిరేవుల, ఔరంగాబాద్, దండగుండరేవు, ఎరినమ్మ ఇసుక ర్యాంపుల్లో సుమారు 70 వేల టన్నుల ఇసుక నిల్వలు ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

రోడ్డు దుస్థితిని కనరండీ..


తాళ్లపూడిలో జిల్లా పరిషత్ రోడ్డు దుస్థితి

తాళ్లపూడి: స్థానిక ఆంధ్రా బ్యాంక్ వీధి నుంచి పొలాలకు వెళ్లే జిల్లా పరిషత్ రోడ్డు వర్షాలకు పెద్దపెద్ద గోతులు పడి బురదగా మారింది. వర్షపు నీరు రోడ్డు గోతుల్లో నిలిచి పోవడంతో పాటు బురద చేరింది. దాంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు విద్యార్థులు, రైతులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు మీదుగా ఆర్‌బీకేకు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు, స్థానిక డిగ్రీ, ఇంటర్ కళాశాలలకు విద్యార్థులు, గ్రామస్తులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వారంతా అధ్వానంగా మారి కనీసం నడవడానికి కూడా అవకాశం లేని ఈ రోడ్డుపై అవస్థలు పడుతున్నారు. పైగా రోడ్డు పక్కనే కొందరు వ్యర్థాలు వేస్తున్నారు. గోతుల్లో పడినపుడు బురద అవుతుందని వాపోతున్నారు. ఈ రోడ్డు దుస్థితిపై గతంలో రైతులు, స్థానికులు జిల్లా కలెక్టర్‌కు, ఇతర అధికారులకు కూడా ఫిర్యాదు చేశారు. ఈ రోడ్డును పునర్నిర్మించి తమ సమస్యను గట్టెక్కించాలని స్థానికులు కోరుతున్నారు.

విరిగి పడిన చెట్టు కొమ్మ


కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో విరిగి పడిన మర్రిచెట్టు కొమ్మ

కొవ్వూరు: పట్టణంలో శనివారం ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు తోడు ఈదురు గాలులు వీయడంతో గోష్పాద క్షేత్రంలోని మర్రి చెట్టు కొమ్మ విరిగి పడింది.ఎ డతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మెయిన్ రోడ్డుపై ఎక్కడిక్కడే వర్షపు నీరు నిలచిపోయింది. పెట్రోల్ బంకల సెంటర్‌లో రోడ్డుపై భారీ వర్షపు నీరు నిలచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ప్రభుత్వాసుపత్రిలో పారిశుద్ధ్యం ఘోరం


ప్రభుత్వాసుపత్రి ఆవరణలోని చెత్త బుట్టలోని వ్యర్థాలు

నిడదవోలు: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పారిశుధ్యం పడకేసింది. రోగాలు నయం చేసుకోవడానికి వస్తున్న రోగులు ఇక్కడి పారిశుధ్య పరిస్థితులను చూసి నివ్వెరపోతున్నారు. ఈ ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు, ఇతర వైద్య సిబ్బంది పూర్తిస్థాయిలో ఉన్నప్పటికీ పారిశుధ్య కార్మికుల కొరత మాత్రం వెంటాడుతోంది. ఫలితంగా ఆసుపత్రి ఆవరణలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. పారిశుధ్య సిబ్బంది రోజూ ఉదయం, సాయంత్రం ఆసుపత్రి పరిసరాలను శుభ్రం చేయాలి. అయితే పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో ఎక్కడ చెత్త అక్కడ పేరుకుపోతున్నాయి. దీంతో ఆసుపత్రికి వచ్చే తమకు మరిన్ని రోగాలు సోకే అవకాశం ఉందని రోగులు వాపోతున్నారు. ఈ ప్రభుత్వాసుపత్రిలో రోజుకు 200 నుంచి 250 వరకూ ఓపీ నమోదవుతుంది. ఆసుపత్రిలో అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు ఐదుగురు ఉండగా వారిలో ముగ్గురు ఇటీవల మానేశారు. ఆరు నెలలుగా జీతాలు బకాయి పడడమే ఇందుకు కారణం. ఇక కేవలం ఇద్దరి మాత్రమే పని చేస్తున్నారు. వీరిపై అధిక పనిభారం పడుతోంది. దీంతో ఆసుపత్రి పరిసరాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. అందుబాటులో ఉన్న ఇద్దరు పారిశుధ్య కార్మికులు ఆపరేషన్ థియేటర్ లోపల, అత్యవసర విభాగాల్లో పని చేస్తున్నారు. దీంతో మిగతా ఆసుపత్రి పరిసరాలు అధ్వానంగా తయారవుతున్నాయి. ఆసుపత్రి వర్గాలు వెంటనే చర్యలు తీసుకొని పారిశుధ్య కార్మికులను తక్షణమే నియమించి పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరచాలని రోగులు కోరుతున్నారు.

పౌర జీవనానికి అంతరాయం


నిడదవోలులో కురుస్తున్న వర్షానికి గొడుగు నీడలో..

నిడదవోలు: రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి నిడదవోలు, పరిసర ప్రాంతాల్లో పౌర జీవనానికి అంతరాయం కలిగింది. పల్లపు ప్రాంతాలు నీట మునగడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ కురిసిన వర్షానికి పట్టణంలోని ఫుట్‌పాత్‌లపై తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులు అమ్మకాలు లేక ఇబ్బందులు పడ్డారు. కూలి పనులు లేకపోవడంతో రెక్కాడితే గాని డొక్కాడని కూలీల ఉపాధికి విఘాతం కలిగింది. కట్టెలతో వంట చేసుకునే వారు వర్షానికి తీవ్ర అగచాట్లు పడ్డారు. కాగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నీట మునిగింది. బస్టాండ్ పల్లంగా ఉండడంతో పట్టణంలోని మురుగు కాలువల ద్వారా వచ్చే వరద నీటితో మునిగి పోతోంది. బస్టాండ్ వెనుక భాగంలోని డ్రైనేజీలలో ఈ ఏడాది ఇంతవరకూ పూడిక తీయలేదు. ఫలితంగా మురుగు నీటితో కలుస్తున్న వర్షపు నీటికి డ్రైన్లు పొంగి పొర్లుతున్నారు. వర్షపు నీరు బస్టాండ్‌లోకి ప్రవేశించడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. మోకాలి లోతు నీటిలోంచి ప్రయాణికులు రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది.ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని వారు కోరుతున్నారు.


తాళ్లపూడిలో ఇటీవల నాట్లు వేసిన వరిచేలో చేరిన వర్షపు నీరు


చాగల్లు మండలం బ్రాహ్మణగూడెంలో నిడదవోలు- పంగిడి రోడ్డుపై వర్షపు నీరు

కాగా ప్రస్తుత ఖరీఫ్ సాగుకు ఈ వర్షం అనుకూలమని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డెల్టా కాలువలకు గోదావరి జలాలు పుష్కలంగా విడుదల కావడంతో వ్యవసాయ అవసరాలకు నీటి ఇబ్బందులు లేదని వారు చెబుతున్నారు. నిడదవోలు నియోజకవర్గంలోని డెల్టా, మెట్ట ప్రాంతాల్లో ఖరీఫ్ సాగు పనులు జోరుగా సాగుతున్నాయి.

ఏకధాటిగా వర్షం

తాళ్లపూడి: మండలంలో శనివారం తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకూ ఏకధాటిగా భారీ వర్షం కురుస్తూనే ఉంది. వేగేశ్వరపురం, తాళ్లపూడి, బల్లిపాడు, అన్నదేవరపేట, పెద్దేవం, ప్రక్కిలంక తదితర గ్రామాలోని రోడ్ల పైన వర్షపు నీరు నిలిచిపోయింది. పలుచోట్ల రోడ్డు చిత్తడిగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మండలంలో ముమ్మరంగా ఖరీఫ్ వరి నాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. ఇటీవల నాట్లు వేసిన వరి చేలల్లో వర్షం నీరు చేరడంతో ముంపు బారిన పడ్డాయి.

చాగల్లు మండలంలో..

చాగల్లు: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. పలు గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. బ్రాహ్మణగూడెం, చాగల్లు, ఊనగట్ల తదితరు గ్రామాల్లో చెరువులు పొంగి పొర్లుతున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి వర్షం నీరు వచ్చి కలవడంతో పేముల కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. రహదారులపై వర్షపు నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

వృద్ధురాలి వైద్యానికి 'మానవత' ఆర్థిక సాయం


మలకపల్లిలో వృద్ధురాలి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న మానవత సంస్థ సభ్యులు

తాళ్లపూడి: తుంటి ఎముక విరగడంతో ఆపరేషన్ జరిగి రెండు నెలలుగా మంచానికే పరిమితమైన మండలంలోని మలకపల్లికి చెందిన తిరుమల అమ్మాజీ అనే వృద్ధురాలి వైద్యానికి మానవత సంస్థ మండల శాఖ ఆర్థిక సాయం చేసింది. ఆ సంస్థ తరపున రూ.ఆరు వేలు, మలకపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి అన్నపూర్ణ రూ.2 వేలు సమకూర్చారు. ఈ రూ.8 వేల మొత్తాన్ని శనివారం మలకపల్లిలో మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షుడు అంకెం సురేష్ చేతుల మీదుగా ఆ వృద్ధురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ కార్యదర్శి సనపల రాజశేఖర్ మాట్లాడుతూ రెండు నెలల పాటు సంస్థ సభ్యత్వాల నమోదు కొనసాగుతోందన్నారు. మానవతా వాదులందరూ స్పందించి రూ.600 సభ్యత్వం చెల్లించి సంస్థ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో అప్పన వీరహనుమంతరావు, అప్పన చంద్రధర గుప్తా, జోడాల వెంకటేశ్వరరావు, సాయన సుబ్బారావు, గంధం మునేశ్వరరావు, డాక్టర్ అన్నపూర్ణ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'తో చురుగ్గా రింగ్ ట్రెంచ్ పనులు


ఆయిల్‌పామ్ చెట్టుకు రింగ్ ట్రెంచ్ చేసిన కూలీలు

నల్లజర్ల: ఉపాధి హామీ పథకంలో ఉద్యాన తోటలలో రింగ్ ట్రెంచ్ (చెట్ల మొదళ్ల చుట్టూ పళ్లాలు) పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నట్టు ఉపాధి ఏపీఓ వెంకట్రావు తెలిపారు. మండలంలో ఇంత వరకూ దాదాపు 100 హెక్టార్ల విస్తీర్ణంలో ఈ పనులు పూర్తయినట్టు చెప్పారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున రింగ్ ట్రెంచ్‌కు నేల అనుకూలంగా ఉంటుందన్నారు. ఐదేళ్ల వయసు పైబడిన కొబ్బరి, జీడిమామిడి, ఆయిల్‌పామ్, మామిడి చెట్ల చుట్టూ ఒక మీటరు వెడల్పున అడుగు లోతు, 10 మీటర్ల విస్తీర్ణంలో ఉపాధి కూలీలు ట్రెంచ్ తయారు చేస్తున్నారన్నారు. దీనివల్ల వేరు వ్యవస్థ బలపడి, సమృద్ధిగా మొక్క భూమిలోని నీటిని తీసుకుంటుందన్నారు. ఒక్కో మొక్కకు రెండు క్యూబిక్ మీటర్లు కొలత వస్తుందన్నారు. ఇద్దరు కూలీలు ఒక రోజులో ఈ పని చేయగలుగుతున్నారని ఏపీవో వివరించారు. అవసరమైన రైతులు తమ గ్రామంలోని ఫీల్డ్ అసిస్టెంట్‌కు తమ తోటల వివరాలు, పాస్‌బుక్ జిరాక్స్‌లు అందించి నమోదు చేయించుకోవాలన్నారు. పరిపాలనా ఆమోదం పొందిన తర్వాత పనులను ప్రారంభిస్తారన్నారు.

2024–25 సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో చేపట్టబోయే పనుల గుర్తింపునకు నిర్వహించిన గ్రామ సభలు పూర్తయ్యాయన్నారు.ఆయా గ్రామ పంచాయతీలు ఇచ్చిన తీర్మానాలు ఆధారంగా పనులకు అంచనాలు రూపొందిస్తున్నట్టు చెప్పారు.

పారిశుధ్యం మెరుగు పరిచేందుకు చర్యలు

- జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు
- సమిశ్రగూడెంలో పనుల పరిశీలన


నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు

నిడదవోలు రూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టినట్టు జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) రాంబాబు అన్నారు. మండలంలోని సమిశ్రగూడెంలోని షాదీఖానా వీధిలో అపరిశుభ్రంగా ఉన్న డ్రెయిన్‌లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు వ్యాప్తి చెందకుండా డ్రెయిన్‌లలో పేరుకుపోయిన పూడికను తొలగించి బ్లీచింగ్ చల్లాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈవోపీఆర్‌డీ ఎస్.రత్నమాలిక, పంచాయతీ కార్యదర్శి ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే ప్రధానం

ఉండ్రాజవరం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎటువంటి వ్యాధులు దరి చేరవని ఇన్‌చార్జ్ ఎంపీడీవో ప్రసాద్ అన్నారు. మండలంలోని ఉండ్రాజవరం, తాడిపర్రు తదితర గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను శనివారం ఆయన పరివేక్షించారు. వీధుల్లోని చెత్తను సిబ్బంది జేసీబీతో తొలగించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని ఈ సందర్భంగా ఆయన పంచాయితీ కార్యదర్శులను ఆదేశించారు. అలాగే ప్రజలకు సరఫరా చేసే రక్షిత మంచినీటి ట్యాంకులను రోజూ క్లోరినేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలి

ఏపీటీఎఫ్ జిల్లా శాఖ డిమాండ్

దేవరపల్లి/తాళ్లపూడి: రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆకాంక్షను నెరవేరుస్తుందని ఎదురు చూస్తున్న తరుణంలో జీపీఎస్ విధానాన్ని అమలు చేయడానికి సిద్ధపడడం తగదని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దున్నా దుర్గారావు, ప్రత్తి సువర్ణరాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీపీఎస్ విధానం సీపీఎస్ విధానం కంటే దారుణమైనదని వారు అన్నారు. పదవీ విరమణ తరువాత పీఆర్‌సీ, హెల్త్‌కార్డులు వర్తించవని దుర్గారావు అన్నారు. ఉద్యోగి చెల్లించిన 10 శాతం గ్రాంట్, ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్‌ను కూడా ప్రభుత్వమే తీసుకుంటుందన్నారు. ఉద్యోగికి 33 ఏళ్ల సర్వీసు ఉంటేనే 50 శాతం పెన్షన్ వస్తుందన్నారు. సర్వీస్ తగ్గితే పెన్షన్ తగ్గుతుందని, ఈ విధంగా అనేక నష్టాలు ఉన్నాయని ఆయన వివరించారు.

జీపీఎస్ ఏ మాత్రం గ్యారంటీ లేని విధానమని ఆయనన్నారు. ప్రస్తుత ప్రభుత్వం 2023 అక్టోబరు 20 నుంచే ఈ చట్టం అమల్లోకి వచ్చినట్టు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని ఏపీటీఎఫ్ జిల్లా శాఖ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని దుర్గారావు పేర్కొన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, లేని పక్షంలో నూతన ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు తొలి బహుమతిగా జీపీఎస్ ఇచ్చినట్టు భావించవలసి ఉంటుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి జీఓ నంబర్ 54ను రద్దు చేస్తూ ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల నుంచి వ్యతిరేకత ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు.

దుర్మార్గం: యూటీఎఫ్ మండల శాఖ

ఉండ్రాజవరం: గత ప్రభుత్వం తయారు చేసిన జీపీఎస్ విధానం రాజముద్రను ప్రస్తుత ప్రభుత్వం విడుదల చేయడం దుర్మార్గమని యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు కొంకట్ల వెంకటరత్నం, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ ఐ.రాంబాబు, మండల గౌరవాధ్యక్షుడు ఎస్.లక్ష్మీనారాయణ శనివారం పేర్కొన్నారు. సీపీఎస్‌పై ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి, అందరికీ ఆమోదయోగ్యమైన విధానాన్ని అమలు పరుస్తామని ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందన్నారు. ఇప్పుడు దానికి విరుద్ధంగా చడీ చప్పుడు కాకుండా గత ప్రభుత్వం తయారు చేసిన జీపీఎస్‌ను అమలులోకి తీసుకురావడం వలన ఉద్యోగులు నష్టపోతారన్నారు.

20న ఆర్యాపురం బ్యాంక్ ఎన్నికలు

రాజమహేంద్రవరం సిటీ: ది ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పాలక వర్గ ఎన్నికలను ఈ నెల 20వ తేదీన ఎస్‌కేవీటీ ఇంగ్లిష్ మీడియం స్కూల్, ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి వి.కృష్ణకాంత్ తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఒకటో నియోజకవర్గంలో 31 మంది, 3వ నియోజకవర్గంలో ముగ్గురు అభ్యర్థులు పోటీలో ఉన్నారన్నారు. పోటీలో ఉన్నవారికి ఎన్నికల గుర్తులు కేటాయించామని తెలిపారు. 20వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ జరుగుతుందన్నారు. ఒకటో నియోజక వర్గానికి సంబంధించి పోలింగ్‌ను రాజమహేంద్రవరంలోనూ, 3వ నియోజక వర్గానికి సంబంధించిన పోలింగ్‌ను దివాన్ చెరువు, విశాఖపట్నం, అమలాపురం, భీమవరం, గుంటూరులోని ఆర్యాపురం బ్యాంక్ శాఖల్లో నిర్వహిస్తామన్నారు.